

టీటీడీకి ద్విచక్ర వాహనం విరాళం



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం టివిఎస్ సంస్థ టివిఎస్ అపాచీ ఆర్టీఆర్ 310 ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించింది. ఈ వాహనం ధర రూ.3లక్షల 5వేలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ఎండి టీటీడీ బోర్డు సభ్యులు సుదర్శన్ వేణు వాహనం తాళాలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు. తిరుమల డిఐ జానకిరామ రెడ్డి, సంస్థ ప్రతినిధులు రాజారెడ్డి, భక్తవత్సలం, సిద్ధార్థ్ పాల్గొన్నారు.



కమ్మేస్తున్న కరువు

- కష్టాల ఊబిలో రైతన్నలు
- నిలకడ లేని ధరలు
- పట్టించుకోని ప్రభుత్వం
- అసంపూర్తిగా నివేదికల సమర్పణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

చిత్తూరు జిల్లాను కరువు కమ్మేస్తోంది.. ఈ ఏడాది ప్రధాన పంట అయిన వేరుశనగ కూడా చేతికందేలా లేదు.. పెట్టిన పెట్టుబడి రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలీక రైతులు అల్లాడుతున్నారు.. నిలకడ లేదని టమోటా ధరలు, గిట్టుబాటు ధరలేని మామిడి రైతులు నిలువునా కష్టాల ఊబిలో మునిగిపోతున్నారు... జిల్లాలోని రైతాంగం కరువు కోరల్లో చిక్కుకుని అల్లాడుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రైతాంగాన్ని ఆదుకోవడానికి పథకాలు తెచ్చాము.. రైతు భరోసా కేంద్రాలు పెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వానికి రైతన్నలు కష్టాలు పట్టడం లేదు... పైగా జిల్లాలోని పలమనేరు, గంగవరం, రొంపిచెర్ల, రామకుప్పం మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి జిల్లాలోని మిగిలిన కరువు మండలాలకు అన్యాయం చేసింది.

చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లోని కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే కరువు ఛాయలు కనిపించాయని, మిగిలిన పంటలు బాగున్నాయంటూ జాబితా సమర్పించడంపై జిల్లాలోని రైతులు సంఘాలు, వామపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాయలసీమ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతాంగాన్ని అదుకొనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లాలో రబీ, ఖరీఫ్ సాగు అంతంతమాత్రమే.. ఈ ఏడాది ఖరీఫ్ సాగు 50శాతం కంటే తక్కువే పంట చేతికి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కరువు అంచనా వేసిన సాంకేతిక నిపుణులు జిల్లాలోని 27 మండలాల్లో రైతాగం ఎలాంటి ఇబ్బంది లేదంటూ ఇచ్చిన నివేదిక జిల్లా రౌతాంగాన్ని విస్మయానికి గురి చేస్తోంది. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న పరిస్థితులను అధ్యయనం చేసి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

తగ్గిన సాగు విస్తీర్ణం

చిత్తూరు జిల్లా ప్రధానంగా ఖరీఫ్ సాగుపైనే ఆధారపడి ఉంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం అధికం గతేడాది ఖరీఫ్ సాగు 2.39లక్షల ఎకరాల్లో పంట సాగు ఉంటే 1.93.105 ఎకరాలు మాత్రమే పంటసాగు అందింది. ఈ ఏడాది 2.28 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినా 1.01.355 ఎకరాలే పంట సాగు కనిపించింది. ఈ ఖరీఫ్ సగానికి సంగం తగ్గిపోయింది. ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేసిన జూన్, జూలై మాసాల్లో కురిసిన అడపాదడపా వర్షాలతో వేరుశనగ సాగుకు రైతులు ఉపక్రమించలేదు. ఫలితంగా జిల్లాలో వేరుశనగ విస్తీర్ణం తగ్గిపోయింది.

దిగుబడి అంతంతమాత్రమే...

అష్టకష్టాలు పడి వేరుశనగ పంట సాగు చేసినా రైతులకు దిగుబడి అంతంతమాత్రమే రావడంతో పెట్టుబడి సైతం రావడం లేదని వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎకరాలకు 10 నుంచి 15 క్వాంటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా ఎక్కువ మంది వేరుశనగ రైతులకు 2 నుంచి 5 క్వింటాళ్లే చేతికందుతోంది. ఎకరాకు రూ.25వేలు పట్టుబడిపెడితే రూ.5 నుంచి 11వేలు మాత్రమే లాభం వస్తోందంటున్నారు. అధిక వర్షపాతంలో వేరుశనగ ఏపుగా పెరిగి పంట దిగుబడి తగ్గిందా అంటే అదీ లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడా అత్యధిక వర్షపాతం నమోదు కాలేదు. 10 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయ్యింది. 21 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదు అయ్యింది. వర్షభావ పరిస్థితులతో జిల్లాలో 1.27లక్షల ఎకరాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

ఈ పరిస్థితులకు అంచనా వేయకుండా జిల్లాలో కేవవలం నాలుగు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కరువు మండలంగా ప్రకటించిన మండలానికి ఆ మండల పరిధిలో సాగురైతులకు పెట్టుబడి రాయితీ వస్తుంది. పంట రుణాలు రీషెడ్యూల్ అవుతాయి. పంట రుణాలపై వడ్డీ మాఫీ అవుతుంది. వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పనులపై 50 పని దినాలు కల్పిస్తారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్ మోహ్మన్‌రెడ్డి ప్రభుత్వం కరువు మండలాల విషయంలో క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని కరువు మండలాల సంఖ్యను పెంచి రైతాంగాన్ని అదుకోవాల్సిన అవసరముందని వామపక్ష రైతు సంఘాలు, రైతులు కోరుతున్నారు.

రబీ సాగుపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : వర్షాలు మొదలు కావడంతో జిల్లాలో రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం మెరుగు భాస్కరయ్య ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సాగులో రైతులు తీసుకోవల్సిన సూచనలు తెలియజేశారు. రబీ కాలంలో నెల్లూరు మషురి (ఎన్ఎల్ఆర్ - 34449), నెల్లూరు దాన్యా రాసి (ఎన్ఎల్ఆర్ 3354), సుగంధి (ఎన్ఎన్ఆర్ 30491), ఎంటియు 1010, 1001,1224, బిపిటి 2846 వంటి రకాలను రైతులు సాగుకు ఎంచుకోవచ్చును. నవంబర్ రెండో పక్షంలో నార్లు పోసుకొని డిసెంబర్ 15లోపు నాట్లు వేసుకోవాలి. ఎకరానికి 25-30 కిలోల విత్తనాన్ని, 4-5 సెంట్లు నారు పెంచితే, నారు ఆరోగ్యంగా ఉంటుంది. వరి విత్తనాలను భావిస్టిన్ మందు ద్రావణంలో (లీటర్ నీటికి 2 గ్రాములు) నానబెట్టి నారు పోస్తే, పైరుకు రోగాల బెడద ఉండదు. నారుమడి నుండి నారు తీసే వారం రోజులు ముందు ఎకరానికి సరిపడా నారుమడికి కిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసి నీరుపెట్టి ఇంకించాలి. దీనివలన పొలంలో నెల వరకు పైరుకు పురుగులు ఆశించవు. 25 రోజుల వయసుగల నారును ప్రధాన పొలంలో నాట్లు వేయడం వలన మంచి ఫలితాలు వస్తాయి.



విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం

నేడు విద్యాసంస్థల బంద్




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి, యువజన సంఘం నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విశాఖ ఉక్కు పరిరక్షణ, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని పలు విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక బైరాగిపట్టేడలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి చలపతి, పిడిఎస్యూ రాష్ట్ర నాయకులు ఆదిలి మాట్లాడుతూ విద్యార్థి, యువజన నాయకులు 32మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న ఆత్మగౌరవ పోరాటం నవంబర్ 8 నాటికి 1000 రోజులు పూర్తి అయ్యిందన్నారు. ఈసందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలకు పిలుపునిచ్చాయన్నారు. కరోనా కష్టకాలంలో లక్షల మందికి ఆక్సిజన్ అందజేసి ప్రాణాలు నిలబెట్టిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టాలన్న ఆలోచన దుర్మార్గమన్నారు. లాభాలు వస్తున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ఇనుప గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాలు అభివద్ధికి నిధులు కేటాయించకుండా నూతన పరిశ్రమలు ఏర్పాటు వంటి విభజన హామీలు అమలు చేయాలని రాష్ట్రంలోని బిజెపి నేతలు మోడీని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు అన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రయోజనాల కంటే ముఖ్యమంత్రికి వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. కేసుల భయంతో మోడీ ముందు మోకరిల్లుతున్నారని దుయ్యబట్టారు. తన సొంత జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండుసార్లు శంకుస్థాపన చేసినా ఆచరణలో పురోగతి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక యువతకి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పేజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్‌కు జిల్లాలోని విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, మేధావులు, ప్రజలు ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి సహకరించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి, అక్బర్, శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, సుందర్ రాజు, ఓమ్‌రాజ్, హరి కష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

8న కార్వేటి నగరంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈనెల 8న బుధవారం జిడి.నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు మొదలు ప్రత్యేక అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వరకు సంబంధిత మండలంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలిపారు.

దేశ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది : ప్రొఫెసర్ ప్రేసర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రేసర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారతదేశం ఆర్థిక పరిస్థితి చాలా మెరుగుగా ఉందని ప్రొఫెసర్ ప్రేసర్, సోషల్ పాలసీ నిపుణులు, ఈడెన్బర్గ్ యూనివర్సిటీ, స్కాట్లాండ్ అన్నారు. మంగళవారం స్థానిక మురకంబట్టులోని అపోలో యూనివర్సిటిలో పేదరిక నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అనే అంశం మీద ప్రొఫెసర్ ప్రేసర్, సోషల్ పాలసీ నిపుణులు అపోలో విద్యార్థిలతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసగించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం ఆర్థిక పరిస్థితి బాగా వృద్ధిలోకి వచ్చిందని దీనికి కారణం ప్రభుత్వ పథకాలు, ప్రజల భాగస్వామ్యమని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనకు నేషనల్ ఇన్సూరెన్స్ స్కీమ్ తోడ్పడుతుందని, స్వయం ఉపాధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. అధ్యాపకులు పబ్లిక్ హెల్త్‌క్లినికల్ సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

10 ఓట్లకు పైగా ఉన్న డోర్ నెంబర్లు విచారిస్తాం : జెసి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో 10ఓట్లకు పైగా ఉన్న డోర్ నెంబర్లు విచారిస్తామని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 320 జెన్ క్యారెక్టర్లు ఉన్నాయని త్వరలో వాటిని పరిశీలించి పూర్తిచేయడం జరుగుతుందని వివరించారు. డబుల్ ఎంట్రీకి సంబంధించి 10,607 రావడం జరిగిందని, ఇవి 842 గహాలలో ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో 5155కు ఫారం 8 తీసుకోవడం జరిగిందని 215కు ఫారం -7 తీసుకోవడం జరిగిందని మిగతా 4078కి సంబంధించి నిర్ణీత కాలవ్యవధి లోపల పరిశీలించి పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. డిఆర్ఒ ఎన్.రాజశేఖర్, సూపరింటెండెంట్ బ్యూలా పాల్గొన్నారు.

కోస్టా కాఫీ దీపావళి కి ప్రత్యేక ప్రచారం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ



స్టమర్ కాఫీ, భారతదేశంలోని వాణిజ్య పానీయాల వర్గాల్లో ప్రముఖ కాఫీ బ్రాండ్ అయిన కాస్ట కాఫీ, ప్రఖ్యాత బేకర్, కంటెంట్ సష్టికర్త అయిన శివేష్ భాటియా సహకారంతో ఈ సంవత్సరం దీపావళి ప్రచారం ప్రారంభించేందుకు ఉత్సాహంగా ఉందని ఆ సంస్థ జిఎం వినయ్ నాయర్ మాట్లాడుతూ కోస్తా కాఫీ పానీయాల రంగంలో ప్రత్యేకపేరు గడిచిందన్నారు. దీపావళి సందర్భంగా వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు రుచి చూచి నాణ్యతను ప్రత్యేకంగా అందిస్తూ, దీపావళి సంబరాలను విజయవంతంగా చేసుకోవాలని ఆశిస్తుందన్నారు. అందులో భాగంగా దీపావళికి ప్రత్యేక రుచిని అందిస్తుందని దీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిప్పుతో ముప్పు.. జాగ్రత్త వహించాలని చెప్పు!

- 14 నుంచి గ్రామాల్లో అగ్నిమాపకశాఖ అవగాహన కార్యక్రమాలు
- ముందస్తు నివారణ చర్యలపై సూచనలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అగ్ని ప్రమాదాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయడానికి అగ్నిమాపక శాఖ అధికారులు ముందుకొస్తున్నారు. ముందస్తు చర్యలతో పూర్తిగా ప్రమాదాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. నాశిరకం విద్యుత్ ఉపకరణాలతో ఎక్కువ విద్యుత్ ప్రమాదాలు జరుగుతన్నాయని అధికారులు బావిస్తున్నారు. వంటింటి గ్యాస్ లీకేజి విషయంలో గృహిణులు పూర్తి అవగాహన కలిగి ఉండేలన్నదే వారి సూచన. ఆసుపత్రులు, సినిమా థియేటర్లు, షాపింగ్‌మాల్స్, బట్టల దుకాణాలు, హోటల్స్, విద్యాసంస్థలు, పరిశ్రమల్లో తప్పని సరిగా అగ్నిమాపక శాఖ సూచనలు పాటించాల్సిందే అంటున్నారు.

జిల్లాలో అందుబాటులో ఉన్న అగ్నిమాపక కేంద్రాలు..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 5కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రస్తుతం నీరు తరలి ంచేవాహనాలు 6, రెస్క్యూ వాహనం 1, జీపు 1 అందుబాటులో ఉన్నాయి. కాగా 95 మంది సిబ్బంది ఈ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

జిల్లాలో అగ్నిమాపక కార్యాలయాలు
చిత్తూరు
పుంగనూరు
పలమనేరు
కుప్పం
నగరి

వారోత్సవాలతో ఊరూరా అవగాహన

అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అగ్నిమాపకశాఖ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనుంది. ఆయా స్టేషన్ పరిధిలో ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, అగ్ని ప్రమాదం సంబవించినప్పుడు చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలను గురించి డెమో నిర్వహించనున్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం ఇవ్వాలి

"అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సందర్భంగా వెంటనే ఆలస్యం చేయకుండా 101కి ఫోన్ చేయాలి. ముందస్తు నివారణ చర్యలతో అగ్ని ప్రమాదాలను అదిగమించవచ్చు. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ ఉప కరణాలను వినియోగిస్తే మంచిది. గ్రామీణ ప్రాంతాల్లో అడవులకు నిప్పుపెట్టడం మానుకోవాలి. వాణిజ్య కేంద్రాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ప్రస్తుత దిపావళి సందర్భంగా తత్కాలిక దుకాణ నిర్వహకులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలి. జాగ్రత్తలు పాటిస్తూ పండుగ ప్రజలు జరుపుకోవాలి.

- పెద్దిరెడ్డి, అగ్నిమాపక జిల్లా అధికారి, చిత్తూరు

జిల్లాలోని రైతన్నలకు రూ.94.29 కోట్లు లబ్ధి



వైయస్సార్ రైతు భరోసా చెక్కులను అందజేస్తున్న జెసి, మేయర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రైతు చేతిలో, వ్యవసాయ భూమిలో ధాన్యలక్ష్మీ ఉన్నదని, ముఖ్యమంత్రి 2023-24 సంవత్సరానికి గానూ డాక్టర్ వై.యస్.ఆర్ రైతు భరోసా - పి.ఎం కిసాన్ రెండవ విడత నగదును రైతులకు అందజేయడం చాలా సంతోషంగా ఉందని చిత్తూరు నగర మేయర్ అముద తెలిపారు. మంగళవారం రెండవ విడత ఆర్థిక సాయం నగదు జమ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పుట్టపర్తి నుండి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా సచివాలయం సమావేశపు మందిరం నుండి వర్చువల్‌గా ఈ కార్యక్రమానికి చిత్తూరు నగర మేయర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులు మురళీకష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభారాణి, జడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి, రైతులు పాల్గొన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ.. రైతులు గతంలో వ్యవసాయం చేయడానికి ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనడానికి అవసరమైన నగదు లేక చాలా కష్టపడుతూ కుటుంబ పోషణ కూడా ఇబ్బందిగా మారేదని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. జెసి శ్రీనివాసులు మాట్లాడుతూ భూయజమానులు, కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతుల సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకుని పంటకు పెట్టుబడి సాయం కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయించే అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.13,500 లు మూడు విడతలలో అందిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అవసరమైన ఎరువులు, విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 2023-24 సంవత్సరంలో మొదటి విడతగా 2,28,091 రూ.171 కోట్లు లబ్ది పొందగా, రెండవ విడతగా 2,31,144 మంది రైతులు రూ.94.29 కోట్లు ఇప్పటి వరకు మొత్తం రూ.1,391 కోట్లు లబ్ది చేకూర్చడం జరిగిందని తెలిపారు.

అభ్యర్థి ప్రకటన గాలిమాటలే...

ఎపిఎస్ ఆర్టీసీ వైఎస్ ఛైర్మెన్ విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు వైసిపి అభ్యర్థి అరణి శ్రీనివాసులు ప్రకటనపై ఎపిఎస్ ఆర్టీసీ వైఎస్ ఛైర్మెన్ స్పందించారు. సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా డిప్యూటీ సిఎం అంజాద్‌భాషా, చిత్తూరు ఎంపి రెడ్డిప్పలు చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అని ప్రకటించడం గాలి వార్త మాత్రమనేని ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠంగా ప్రజా బలం ఉన్న పార్టీ వైసిపి మాత్రమనేని తమ పార్టీ అధినాయకులు జగన్‌మోహ్మన్‌రెడ్డి లేదా జిల్లా కన్వీనర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాత్రమే అభ్యర్థిలను ప్రకటించే అవకాశముదంన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కరుణకుమార్

సాంకేతిక పరిజ్ఞానం వాడుకొని కేసులను సత్వరంగా పరిస్కారించు కోవచ్చునని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కోర్టు న్యాయసధన్ భవనంలో డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వాడుకొని సత్వర సమన్యాయంతో జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిస్కారించుకోవచ్చునని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు ఆధ్వర్యంలో జిల్లాలో 2023 డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో బీమా, మోటార్ వాహనాలు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. జిల్లాలో నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించి రాష్టంలోనే చిత్తూరు జిల్లాను ముందంజలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

17న పెద్దశేష వాహనంపై శ్రీ మలయప్ప దర్శనం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో నవంబరు 17వ తేదీన నాగులచవితి పర్వదినం సందర్భంగా శ్రీమలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి తిరుమాడ వీధులలో పెద్దశేష వాహనంపై విహరిస్తు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవ వాహనసేవలలో కూడా తొలి ప్రాధాన్యత ఆదిశేషునికే ఆ భగవంతుడు ప్రసాదించారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల నాలుగు మాడవీధులలో రాత్రి 7 నుండి 9 గంటల నడుమ శ్రీ మలయప్ప స్వామివారు తమ ఉభయదేవేరులతో కలిసి విహరిస్తూ పెద్దశేష వాహనంపై కటాక్షించనున్నారు.

రాజకీయ నాయకుడిలా ఛాలేంజులా..

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానలో పార్వేటి మండపం కూల్చేవేయాలని నిర్ణయం తీసుకోవడంపై టీటీడీ ఈఓకు లీగల్ నోటీస్ పంపామని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూల్చివేయాలని నిర్ణయం తీసుకోవటం వెనుక ఉన్న అందరిపైనా వారం రోజుల్లో కోర్టులో కేసు వేయనున్నామన్నారు. టీటీడీ ఈవో ఛాలెంజ్ చేశారు. పార్వేటీ మండపం వద్ద చర్చకు రమ్మంటూ టీటీడీ ఈవో ఛాలెంజ్ చేశారు. కాబట్టే వచ్చామని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు. టీటీడీ ఈవో రాజకీయ నాయకుడిలా ఛాలెంజులు విసరటం మంచిది కాదన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడలో

'స్విమ్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ



శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి విద్యార్థులు ఐఐటి ఏర్పేడు తిరుపతి జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన సన్యోగ్ - 2023 ఇన్విటేషనల్ ఇంటర్ కాలేజీయేట్ షట్టలే బాడ్మింటన్ (ఉమెన్స్) ఛాంపియన్స్‌లో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ విద్యార్థులు రన్నర్స్ ఛాంపియన్స్‌గా నిలచారని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి.కుమార్ మాట్లాడుతూ క్రీడలు, వ్యాయం అనేది మానవ జీవితంతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. మానసిక, శారీరక ఆనందానికి ఇవి ఎంతగానో దోహదపడుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాధవి, ఫిజికల్ డైరెక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సివైకి అరుదైన అవార్డు



ప్రజాశక్తి-పుంగనూరు: భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్‌కు అరుదైన అవార్డు వరించింది. సామాజిక సేవా విభాగంలో మంగళవారం బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ తవార్ చంద్ గెహ్లోట్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. రామచంద్ర యాదవ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయండి



ప్రజాశక్తి-ఎస్‌ఆర్‌పురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో వైసిపి నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. 9వ తేదీ నుంచి మండలంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి జెడ్‌పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, జనార్దన్, కుప్పయ్య, మారొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ప్రజాశక్తి-చౌడేపల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని సత్సంగ్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. మండలంలోని పెద్ద కొన్నామరి పంచాయతీ ఆరోగ్య కేంద్రం వద్దగల సత్సంగ్ ఫౌండేషన్ పవిత్ర తోటలో సంస్థ అధినేత ముంతాజ్ అలీ ఖాన్ జన్మదినాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రకృతి విధ్వంసం జరగరాదంటే మొక్కలు పెంపకం ఒక్కటే మార్గమన్నారు. అనంతరం వాటి ప్రాముఖ్యతను వివరించి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ వాలంటీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా భరత్‌ని గెలిపించండి: వైసిపి

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీ భరత్‌ను గెలిపించాలని ఆయన సతీమణి దుర్గ కోరారు. మండలంలోని సింగసముద్రం పంచాయతీ కుప్పిగానిపల్లి, జీడి మాకు పల్లి గ్రామాల్లో పర్యటించారు. దీపావళి కానుకగా ఇంటింటికి పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్సీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, బాబురెడ్డి, చంద్రారెడ్డి, లలిత, మురుగేష్, కేశవరెడ్డి, జయపుప తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక



వైసిపిలో చేరుతున్న నాయిబ్రాహ్మణులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నాయీ బ్రాహ్మనులు ఎపిఎస్ ఆర్‌టిసి వైఎస్ చైర్మన్ విజయానందరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. మంగళవారం స్థానిక బార్‌బర్స్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో బార్‌బర్స్ అసోషియేషన్ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు సమక్షంలో వైకాపాలో చేరారు. వీరిని విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడులు వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదల మంచికోసమే

సంక్షేమ పథకాలు: మంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పేదల మంచి కోసమే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం సాయంత్రం గోవిందపాళెం సచివాయల పరిధిలోని 11వ వార్డు సిటిఆర్ నెత్తం, వీరప్ప రెడ్డి కండ్రిక, ఏఏ డబ్ల్యూ, బత్తల వారి కండ్రిక, విద్యానగర్,ఆర్ డి ఎం గేట్ వీధులలో గడపగడపకు మన ప్రభుత్వంను మంత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్ డి జయ ప్రకాష్, డి శంకర్, కౌన్సిలర్ జాన్ కెనడి, ఏకాంబరం, మున్సిపల్ కమిషనర్ రెడ్డి, గజేంద్ర నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వైసిపి కన్వీనర్, మండల కన్వీనర్, అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్యంతో


సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - క్యాంపస్:

శ్రీ పద్మావతి మహిళా విశ్వవి ద్యాలయానికి, జాతీయ ఔషధ మొక్కల బోర్డు మంజూరు చేసిన "ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ మెడిసినల్ గార్డెన్ ఇన్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం" ప్రాజెక్ట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 సంయుక్తంగా ఆయుర్వేద ఫర్ ఒన్ హెల్త్ అనే అంశం పై తిరుపతి రూరల్ మండలలోని కుంట్రపాకంలో అవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జోత్స్న విచ్చేసి ఆయుర్వేదం సంప్రదాయ భారతీయ వైద్య విధానమని, వ్యాధి వచ్చిన తరువాత నయం చేయడం కన్నా, రోగాల బారిన పడకుండా శారీరిక మానసిక రోగ్యాన్ని రక్షించడమే ఆయుర్వేదం ప్రథమ లక్షణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ సుజాత, ఎన్యస్యస్ ప్రోగ్రామ్ అధికారి డా. నీరజ ప్రాజెక్ట్ కో ఇన్వెస్టిగేటర్స్ ప్రొ విజయకుమారి , డా.సువర్ణలత, డా.శాంతిశ్రీ అనేకరకాల ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్థులకు, రైతులకు, ఔషద మొక్కలతో పాటుగా, జమా, దానిమ్మ, ఉసిరి వంటి పండ్ల మొక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శుభ పద్మనాభ రెడ్డి, బయోసైన్స్ అండ్ సెరికల్చర్ ఫీల్డ్ అసి స్టెంట్ అరుణ, గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- టిడిపి ఇంచార్జ్ డాక్టర్ థామస్



ఇంటింట ప్రచారం చేస్తున్న డాక్టర్ థామస్

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని జిడి నెల్లూరు టిడిపి ఇంచార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. మంగళవారం మండలంలో బాబు షూరిటీ భవిష్యత్‌కి గ్యారెంటీ కార్యక్రామాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మిని మ్యానిఫెస్టోను వివరించారు. దేశ రాజకీయాల్లో విజన్ ఉన్న ఏకైక మేధావి చంద్రబాబే అన్నారు. ఆయన వల్ల రాష్ట్రంలో అనేక పరిశ్రమలు యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఆయనను మళ్లీ సిఎంని చేస్తే సామాన్యుడికి మెరుగైన జీవనశైలిని తీసుకొస్తారన్నారు. వైసిపి పాలనలో సామాన్యులకు అవసరమయ్యే ఇసుక, కరెంటు ధరల మోత మోగిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రాజు, తిరుమలనాధ్, చెంగల్రాయల్‌యాదవ్, రాజేంద్రరెడ్డి, రవియాదవ్, బిగలరమేష్, చంద్రమోహన్, సోమశేఖర్‌యాదవ్, ధనంజయరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- సచివాలయంకు రూ.20 లక్షలు గడప గడప నిధులు ఖర్చు పెట్టాలి

- 97 సచివాలయ పరిధిలో అభివృద్ధిని పరుగులు పెట్టించండి.

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులకు నేతలకు పిలుపు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఉపాధి హామీ ద్వారా ప్రతి మండలానికి రూ.60 లక్షలు మంజూరు అ అయ్యిందని ఈ పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులకు, నేతలకు పిలుపు నిచ్చారు.సత్యవేడు నియోజకవర్గానికి వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులతో పనులు చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం ఉదయం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నాయకులతో కలిసి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్యవేడు నియోజకవర్గం లోని 97 సచివాలయాలలో పూర్తయిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఆయా సచివాలయ పరిధిలో నెలకొన్న సిసి రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరారు. ఉపాధి కింద ప్రతి మండలానికి రూ.60 లక్షలు చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు ఈ నిధులను ఆయా పంచాయతీలకు కేటాయించి అధికారుల ద్వారా త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. తద్వారా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

మెటీరియల్ సైన్స్ లో వినూత్న

పరిశోధనలకు కృషి చేయాలి : టీటీడీ డీఈఓ

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రస్తుత కాలానికి అనుగుణంగా మెటీరియల్ సైన్స్ లోని వినూత్న పరిశోధనలకు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, వినూత్న పరిశోధనలపై దృష్టి సారించాలని విద్యార్థులు, పరిశోధకులకు టిటిడి డిఈఓ డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి సూచించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని భౌతికశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో భౌతిక శాస్త్రంలో మెటీరియల్ సైన్స్ కి ప్రాముఖ్యత పెరిగిందని భవిష్యత్తులో మెటీరియల్ సైన్స్ లో పరిశోధనలకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుందన్నారు. విద్యార్థులు, పరిశోధకులు మెటీరియల్ సైన్స్ లో విభిన్న విభాగాలలో, విభిన్న వస్తువులలో, పదార్థాలలో, నూతన ఆవిష్కరణ తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సూచించారు. విద్యార్థులు మెటీరియల్ సైన్స్ వైపు ఆసక్తి కలిగే విధంగా అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు. అభివృద్ధి చెందుతున్న రంగాలలో మెటీరియల్ సైన్స్ పరిజ్ఞానాన్ని నవీకరించ రించడానికి ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు ఎంతో ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. టీటీడీ విద్యాసంస్థలలో పేద విద్యార్థుల కోసం అనేక రకాలైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. టిటిడి విద్యా సంస్థలలో పేద విద్యార్థులకు ప్రత్యేకంగా కొన్ని సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం డిఈఓ డాక్టర్ ఎం. భాస్కర్ రెడ్డిని ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి యు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి, కళాశాల ఉపాధ్యక్షురాలు ఆచార్య పద్మావతి, విభాగాధిపతి ఆచార్య ఆర్పి. విజయలక్ష్మి, సదస్సు కన్వీనర్ ఆచార్య బి.దేవప్రసాద్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్. వెంకటరమణారెడ్డి, డాక్టర్ హేమలత రుద్రమదేవి, అకడమీక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీని సందర్శించిన

జాతీయ మైనారిటీ కమిషన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని జాతీయ మైనారిటీ కమిషన్ ప్రతినిధి ధ్యాన్ కుమార్ జీనప్ప, బృంద సభ్యులతో వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు వర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమై వర్సిటీలో మైనారిటీ ఉద్యోగులు, మైనారిటీ స్కాలర్‌షిప్ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి కార్యక్ర మాన్ని నిర్వహించారు. మైనారిటీ విద్యార్థుల సమ స్యలను, ఉద్యోగుల సమస్యలను గురించి చర్చిం చారు. మైనారిటీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న స్కాలర్షిప్లు ఇతర విద్య, ఉద్యోగ సంబంధిత ప్రాయోజిత కార్యక్రమాలను గురించి విశదీకరించారు. ఈ కార్యక్రమంలో పరిస్థితి విసి ఆచార్య డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే విద్యార్థుల ప్రగతి బాట

ప్రజాశక్తి -రేణిగుంట: విద్యార్థులు ప్రగతి బాటలో నడవాలంటే, ఉత్తమ పౌరులు కావాలంటే శాస్త్రీయ అవగాహన పెంచుకొని శాస్త్రీయ దృక్పథంతో నడవాలని జనవిజ్ఞాన వేదిక నాయకుడు ఇమామ్ పేర్కొన్నారు. రేణిగుంటలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచారం లో భాగంగా మంగళవారం రేణిగుంట విమానాశ్రయం వద్దనున్న గిరిజన గురుకుల పాఠశాల లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు బాలాజీ, జనవిజ్ఞాన వేదిక నాయకులు కుప్పస్వామి, జనవిజ్ఞాన వేదిక జిల్లాఉపాధ్యక్షులు ఓ వెంకట రమ ణ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఆర్‌డబ్ల్యు మహిళా

కళాశాలలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాల లోని ఓపెన్ ఆడిటోరియం సమావేశ మందిరంలో అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఐకానిక్ పీస్ జాతీయ స్థాయి అవార్డు గ్రహీత డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో మంగళ వారం చదరంగం పోటీలు నిర్వ హించా రు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ హను మంతరావు మాట్లా డుతూ విద్యార్థులలో దాగి వున్న మేధాశక్తిని ప్రదర్శించేందుకు ఈ చదరంగం పోటీలు వేది క అన్నారు. ప్రతి సంవత్సరం చదరంగం పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తారన్నారు. అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలకు డిఆర్‌డబ్ల్యు కళాశాల వేదిక కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ హనుమంతరావు పేర్కొన్నారు. చిల్డ్రన్స్‌డే ను పురస్క రిం చుకుని ఈ చదరంగం పోటీలు నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెస్ అసోసియేషన్ నిర్వాహకులు నరేంద్ర నాథ్ చౌదరి పర్యవేక్షణలో పట్టణంలోని 18 పాఠశాలలకు చెందిన 210 మంది విద్యార్థులు ఈ చదరంగం పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెహిమియా, గిరిబాబు, మనోజ్ కుమార్ , యోగి, చెస్ ఆర్గనైజర్ రామ్ , షేక్ అమృద్దీన్ , మురళి, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.

పవన్‌తో హరిప్రసాద్ భేటీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కులాలను కలిపే రాజకీయ విధానమే జనసేన సిద్ధాంతమని జనసేనాని పవన్ కళ్యాణ్ పునరుద్ఘాటించారు. హైదారాబాద్ లో పవన్ కళ్యాణ్ తో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో ప్రస్తుత రాజకీయాల పరిస్థితులను పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. కులాలను కలిపే రాజకీయ విధానంతో, మతాల ప్రస్తావన లేని రాజకీయ సిద్ధాంతంతో జనసేన పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనుసరిం చాల్సిన వ్యూహాలపై చర్చించారు. అక్రమ కేసులపై జనసైనికులకు అండగా ఉంటామని పవన్ హామీ ఇచ్చారన్నారు.

ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం సిపిఎం నాయకులు ప్రజారక్షణ భేరి గోడ పత్రికలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్బంధ విధానాల వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం బతకాలన్నా ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ రాజకీయాలకు వేదిక కానున్న విజయవాడ సిపిఎం ప్రజారక్షణ బహిరంగ సభకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, వెలివేంద్రం, గురుమూర్తి పాల్గొన్నారు.


ఆశావర్కర్ల సేవలు అభినందనీయం

- లయన్స్ క్లబ్ డాక్టర్ రాజారెడ్డి



ప్రజాశక్తి-సదుం: ఆశావర్కర్ల సేవలు అభినందనీయం అని లయన్స్ క్లబ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. మంగళవారం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో మణికంఠ లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పది మంది ఆశా వర్కర్లకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా సదుం సిహెచ్‌సి చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశా వర్కర్స్ సేవలు అమోఘం అని, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ గిరీష, డాక్టర్ చరణ్, ఉదయ్ భాస్కర్, సూపర్ వైజర్ నీలకంఠ, వైద్య సిబ్బంది జానకి, మణికంఠ లయన్స్ క్లబ్ అధ్యక్షులు చాముండీశ్వరయ్య, జోన్ చైర్ పర్సన్ మనోజ్ కుమార్ రెడ్డి, లయన్ నాగరాజు, లయన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి-కార్వేటినగరం: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం ఎస్ఐ దస్తగిరి సూచించారు. స్థానిక కళాశాల ఆవరణంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్లలో అపరిచిత వ్యక్తులతో మాట్లాడటం సంబంధాలు పెంచుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దిలీప్ కుమార్, డైరెక్టర్లు ధనంజయ రెడ్డి, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, ప్రిన్సిపాల్ కిషోర్, హెచ్ఎం మహేశ్వర రాజు, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు ఇచ్చి తీరాల్సిందే

- జనసేన ఇంచార్జ్ పొన్నా యుగంధర్



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని టిఆర్ పురం వాసులకు ఎట్టి పరిస్థితిల్లో ఇంటి పట్టాలు ఇచ్చి తీరాల్సిందేనని జనసేన జిడి నెల్లూరు ఇంచార్జ్ పొన్నా యుగంధర్ డిమాండ్ చేశారు. మంగళవారం టిఆర్ పురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి కూడా 17మందికి పైగా గ్రామస్తులకు జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు మంజూరు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే వారికి పట్టాలు మంజూరు చేయాలని కాని పక్షంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యతీశ్వరరెడ్డి, సతీష్, ముని, వెంకటేష్, హేమంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి



ప్రజాశక్తి-యాదమరి: ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆశా కార్యకర్తల నెలవారి సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో అందించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయరాదన్నారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రాణాంతకమైన జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని గుర్తు చేశారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో విషనాగుల సంచారం

- భయాందోళనలో భక్తులు



ఆలయంలో ప్రత్యక్షమైన నాగుపాము

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ పరిసరాల్లో పారిశుధ్యం లోపించింది. మురుగు నిల్వలతో అడుగడుగునా దుర్గందం వెదజల్లుతోంది. ఫలితంగా దోమలు, క్రిమికీటకాలు ఉండటంతో విషసర్పాలు సంచారం అధికమైంది. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మంగళవారం ఆలయం వద్ద నాగుపాము ప్రత్యక్షమైంది. గమనించిన భక్తులు భయాందోళనతో పరుగులు తీశారు. ఆలయంలో మురుగు నిల్వలు లేకుండా చూడాలని భక్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నమ్మించి మోసం చేస్తున్నాడు...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

కులాలు వేరైనా ఇద్దరం ఇష్టపడి దేవుని సన్నిధిలో ఒకటయ్యామని, ప్రేమ పెళ్లితో దగ్గరైన మమ్మల్ని నా భర్త మహేంద్ర కుటుంబ సభ్యులు వేరు చేసే ప్రయత్నం చేస్తూ వేరే వివాహానికి సిద్ధపడేలా చేశారని, నమ్మించి మోసం చేస్తున్న మహేంద్రను మందలించి కాపురం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కొర్లగుంటకు చెందిన దేవి పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు దేవి మాట్లాడుతూ పెద్దలను ఎదిరించి ఈ ఏడాది జూలై 17న పుత్తూరు సమీపంలోని అంజేరమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నామన్నారు. అయితే కొన్నాళ్లు సజావుగా సాగిన మా కాపురంలో అత్తింటి వారు రాజకీయ పలుకుబడిలతో నా నుండి నా భర్తను దూరం చేసి మరో వివాహం చేసుకోవడానికి సిద్ధపడేలా చేశారన్నారు. దీనిపై దిశ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారని, అయినా మహేంద్ర లో ఎటువంటి మార్పు రాకుండా ఇంటికి రాకుండా, ఫోను ద్వారా సంప్రదించాలని ప్రయత్నించిన నిరాకరిస్తున్నాడని, పోలీసు ఉన్నతాధికారులు తన భర్తను తన వద్దకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, కల్పన, రాజేశ్వరి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

క్వారీలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రమాదవశాత్తు పాడుబడ్డ క్వారీలో పడి మహిళ మృతి చెందిన సంఘటన వెదురుకుప్పం సమీపంలో చోటు చేసుకున్నది. ఏఎస్ఐ సుబ్రమణ్యంనాయుడు కథనం మేరకు.. ఎస్ఆర్ పురం మండలం పిల్లి గుండ్లుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన రాజేశ్వరి(28) మంగళవారం వెదురుకుప్పం మండల పరిధిలో ఆవులు మేపడానికి వెళ్లింది. క్వారీ వైపు వెళ్లి ప్రమాదవశాత్తు క్వారీలో పడి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం మండల ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు, షేక్షావలి, అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మృతి దేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెప్పారు.

నీట మునిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-చిత్తూరు: నీట మునిగి విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం స్థానిక ఐటిఐ కళాశాల వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మురగానుపల్లికి చెందిన గుణశేఖర్ కుమారుడు ప్రణీత్(13) ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన ప్రణీత్ తిరిగి రాలేదు. ఆందోళనతో వెతిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం ప్రభుత్వ ఐటిఐ సమీపంలో నీటి కుంటలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు గుణశేఖర్‌ను అక్కడకు పిలిపించారు. ప్రణీత్ మృతదేహాన్ని గుర్తుపట్టడంతో పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో సైకిల్, బట్టలు గుర్తించారు. కాగా ఈతకు వెళ్లి మృతి చెంది ఉంటారని అనుమానిస్తున్నారు.

ఎట్టకేలకు సెల్ టవర్‌కు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన



మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్లు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిచ్చెన ఊడిపోయి వేలాడుతుండడంతో ప్రజలు భయం గుప్పిట్లో గడిపారు. ఎప్పుడు ఎవరిపై పడుతుందోనని ఆందోళన చెందారు. విషయాన్ని గ్రామస్తులు ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. 'సెల్ టవర్ వద్ద భయం భయం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించి బిఎస్ఎన్ఎల్ అధికారులు మంగళవారం కర్నూలు నుంచి టెక్నీషియన్లను పిలిపించి మరమ్మతులు చేయించారు. దీంతో సమస్యకు తెరపడింది. గ్రామస్తులు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

విషజ్వరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయండి

- డాక్టర్ రవిరాజు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం: విషజ్వరాలపై గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, విరివిగా అవగాహనా కార్యక్రమాలు కల్పించాలని జిల్లా ఇమ్యూనిజేషన్ వైద్యాధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బందితో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న జోరువానలను దృష్టిలో ఉంచుకుని వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్యం లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉంటున్న ఆశా వర్కర్లు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబల కుండా ఎప్పటికప్పుడు నివేధికను వైద్య అధికారులకు అందించేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వలు లేకుండా, వ్యర్థపదార్థాలు నివాస ప్రాంతాల్లో లేకుండా తొలగించేలా చూడాలని పేర్కొన్నారు. డెంగ్యూ, మలేరియా, చికరన్ గున్యా వంటి జ్వరలతో పాటు, అన్ని రకాలైన వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఎస్ఆర్ పురం మండలం ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిత తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, డాక్టర్ గౌరికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ హేమశ్రీ, వైద్యసిబ్బంది పలువురు పాల్గొన్నారు.